
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 20 : ఆగస్టు : 2025



భవిష్యత్ 'పచ్చ'గా ఉండేలా..
పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. 8లో



మణుగూరుపై సింగరేణి ముద్ర
మణుగూరు అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న సింగరేణి.. ఓసీ విస్తరణకు రంగం సిద్ధమైంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30° / 24°
జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం పడే అవకాశం ఉంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద

10 గేట్లు ఎత్తి 20,759 క్యూసెక్కుల నీరు విడుదల



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తుండగా మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం 21,387 క్యూసెక్కుల చొప్పున వరదనీరు రాగా, 10 గేట్లు ఎత్తి 20,759 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా.. ఎగువ నుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని నీటిమట్టాన్ని 71.84 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.


ఆధునిక విద్య అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న నాగ రాజశేఖర్

పాల్వంచ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆధునిక విద్య అందించడమే సర్కారు లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగ రాజశేఖర్ అన్నారు. స్థానిక కేజీబీవీలో జిల్లాలోని గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖాన్ అకాడమీ ద్వారా గణిత, సామాన్య శాస్త్రంలో 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను అందిస్తోందని తెలిపారు. పిల్లలు ఇంటి వద్ద అభ్యసన మెరుగుపర్చుకోవడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది దోహదం చేస్తుందని చెప్పారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా పిల్లలు ఖాన్ అకాడమీ తరగతుల్లో రిజిస్టర్ చేసుకోవడం, తరగతులను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు నాగుల్‌మీరా, హరిప్రసాద్, సంపత్‌కుమార్, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'లో ముగిసిన కళా ఉత్సవ్



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో కళానైపుణ్యాన్ని వెలికితీసేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎంఈఓ బీ.వీ. రామాచారి మాట్లాడగా విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, వివిధ జిల్లాల నవోదయ విద్యాలయాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముందున్నది ముళ్లబాటే!

సింగరేణికి సవాల్ విసురుతున్న కోలిండియా
- అక్కడ తక్కువ ధరకే లభిస్తున్న నాణ్యమైన బొగ్గు
- అటువైపే మొగ్గు చూపుతున్న దక్షిణాది పరిశ్రమలు
- సింగరేణిలో ఉత్పాదక, ఇతర వ్యయాలు అధికం
- అయినా కనిపించని దిద్దుబాటు చర్యలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరతో కోలిండియా, నాణ్యతతో విదేశీ బొగ్గు సింగరేణికి సవాల్ విసురుతున్నాయి. ఉత్పాదక వ్యయం తగ్గించుకోకుంటే సంస్థకు రాబోయే రోజుల్లో ముళ్లబాటేనని స్పష్టంగా తెలుస్తున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో సింగరేణి నుంచి సరైన స్పందన కనిపించడం లేదంటున్నాయి ఆ సంస్థకు సంబంధించిన గణాంకాలు.

చేజారుతున్న మార్కెట్
దక్షిణ భారత దేశంతో పాటు మహారాష్ట్ర, ఒడిశా వరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉన్న భారీ పరిశ్రమలకు నిన్నామొన్నటి వరకు సింగరేణి బొగ్గే ప్రధానం. ఈ బొగ్గును ఉపయోగిస్తున్న పరిశ్రమల్లో సింహభాగం థర్మల్ విద్యుత్ కేంద్రాలది కాగా, ఆ తర్వాత సిమెంట్, ఐరన్ వంటి ఇతర భారీ పరిశ్రమలు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు సింగరేణికి కోలిండియా, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌ల నుంచి సవాల్ ఎదురవుతోంది. ప్రస్తుతం జీ 13 గ్రేడ్ టన్ను బొగ్గును సింగరేణి సంస్థ థర్మల్ పవర్ పరిశ్రమలకు రూ.4000కు విక్రయిస్తుండగా ఇతర పరిశ్రమలకు రూ. 5000కు అమ్ముతోంది. ఇదే గ్రేడ్ బొగ్గును వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ వారు థర్మల్‌కు రూ.2,200, ఇతర పరిశ్రమలకు రూ. 2,600కు మార్కెట్‌లో అందుబాటులోకి తెచ్చారు. కోలిండియా అయితే మరీ తక్కువగా థర్మల్‌కు రూ.1,600 , ఇతరులకు రూ.1,900కు అమ్మేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఇప్పటికే సిమెంట్ తదితర భారీ పరిశ్రమలు కోలిండియా, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ వైపు మొగ్గు చూపుతుండగా థర్మల్ పవర్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న ఎన్టీపీసీ (నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్) సైతం అదే దారిలో వెళ్లేందుకు సన్నాహాలు చేస్తోంది. అధిక రేటు కారణంగా ఒక్కో సంస్థ సింగరేణికి దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తప్పని అధిక వ్యయం..
సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీసే గోదావరి – ప్రాణహిత లోయ పరిధిలో నెలకొన్న పరిస్థితుల వల్ల సహజంగానే ఇక్కడ బొగ్గు ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటోంది. ఓపెన్‌కాస్టు గనుల్లో టన్ను బొగ్గు వెలికి తీయాలంటే ఎనిమిది టన్నుల మట్టిని తీయాల్సి వస్తోంది. అదే కోలిండియా పరిధిలో అయితే టన్ను బొగ్గుకు గరిష్టంగా మూడు టన్నుల మట్టి తీస్తే సరిపోతుంది. దీంతో కోలిండియాలో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. నిన్నామొన్నటి వరకు రైలు మార్గంలో రవాణాకు అధిక చార్జీలు ఉండడంతో కోలిండియా నుంచి బొగ్గు తీసుకునేందుకు దక్షిణాది పరిశ్రమలు వెనకడుగు వేసేవి. కానీ రవాణా సౌకర్యాలు మెరుగుపడుతుండగా ఇప్పుడా ఇబ్బంది పోయింది. దీంతో సింగరేణి నుంచి అధిక ధరకు కొనడం కంటే తక్కువ ధరకు వచ్చే కోలిండియా బొగ్గు వైపు దక్షిణాది పరిశ్రమలు చూస్తున్నాయి.

ఉత్పత్తి వ్యయం తగ్గించేదెలా..
అధిక ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు సమర్థమైన పని గంటలను సింగరేణి సాధించాల్సి ఉంటుంది. కార్మికులు, ఉద్యోగులతో పూర్తి స్థాయిలో పని చేయించుకోవడం, యంత్రాలను గరిష్ట స్థాయిలో వినియోగించడంలో సంస్థ వెనకబడిపోతోంది. ఉదాహరణకు సంస్థ పరిధిలో 40 వేల మంది కార్మికులు ఉండగా ఇందులో రెండు వేల మందికి పైగా కార్మికులు ఎక్కువగా విధులకు ఎగనామం పెడుతున్నారు. గత మూడేళ్లుగా ఒక్కరోజు కూడా విధులకు రాని కార్మికుల సంఖ్య 180కి పైగా ఉంది. ఇలా గైర్హాజరు కార్మికులతో పనిలో సమతుల్యత దెబ్బతింటోంది. అలాంటి వారిని గుర్తించి, సానుకూల మార్పు తెచ్చేలా యాజమాన్యం స్పష్టమైన కార్యాచరణ రూపొందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విధులకు రాని కార్మికులకు ఉన్న ఇబ్బందులు ఏంటి? అందులో పరిష్కరించదగ్గవి ఏమైనా ఉన్నాయా ? నిర్లక్ష్యంతోనే డ్యూటీకి రావడం లేదా.. వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనే అంశంపై ప్రణాళిక లేదనే అపవాదును సింగరేణి మూటగట్టుకుంటోంది. గైర్హాజరు కార్మికులకు మొక్కుబడిగా కౌన్సిలింగ్ నిర్వహించి చేతులు దులపడం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

మస్టర్లు	2022	2023	2024
0	221	183	263
0 - 100	791	960	1,127
101-140	436	448	377
140 -190	688	545	369

వానలతో వి'పత్తే'నా..

- పత్తి చేలలో నిలుస్తున్న నీరు
- ఎర్రబారుతున్న మొక్కలు
- రాలిపోతున్న పూత, పిందె



పత్తి చేనులో నిలిచిన నీరు

బూర్గంపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి చేలు ఎర్రబారుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని చేలలో నీరు నిలిచి మొక్కలు క్రమేపీ దెబ్బతింటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆశాజనంగా ఉన్న పత్తి చేలు.. పది రోజులుగా కురుస్తున్న వానలను తట్టుకోలేకపోతున్నాయి. వర్షాలకు పూత, పిందె రాలుతున్నాయి. పంటను బూజు తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తున్నాయి. మరో వారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో పత్తి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గణనీయంగా పెరిగిన సాగు..
జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు గణనీయంగా పెరిగింది. వరుసగా రెండేళ్ల పాటు మిర్చి వేసిన రైతులకు నష్టాలే మిగలడంతో ఆ పంట సాగును తగ్గించి పత్తి వైపు దృష్టి సారించారు. దీంతో జిల్లాలో సుమారు 2.30 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి పంట సాగవుతోంది. పలు మండలాల్లో జూన్ ఆరంభంలోనే రైతులు పత్తి గింజలు వేయగా.. పంట సాగు చేసి 70 రోజులు కావొస్తోంది. ఇటీవలి వరకు పత్తి పంటలకు వాతావరణం అనుకూలంగా ఉంది. అడపాదడపా వర్షాలతో మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు పైపాట్లు చేయడం, ఎరువులు వేసేందుకు వాతావరణం అనుకూలంగా మారింది. ప్రస్తుతం చాలా చోట్ల పూత, పిందె దశకు చేరింది. ఈ తరుణంలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి పంటపై ప్రభావం చూపుతున్నాయి. మొన్నటి వరకు ఏపుగా, ఆరోగ్యంగా ఎదిగిన మొక్కలకు ఇటీవల కురుస్తున్న వర్షాలు ప్రతికూలంగా మారాయి. లోతట్టు ప్రాంత భూముల్లో నీరు చేరి పత్తి మొక్కలు ఎర్రబారుతున్నాయి. పూత, పిందెలు వానలకు నేలరాలుతుండగా.. పంటకు బూజు తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తున్నాయి.

పెరుగుతున్న కలుపు..
వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తిలో పైపాట్లు చేసేందుకు వీల్లేకుండా పోయింది. దీంతో కలుపు పెరుగుతుండగా.. నివారణకు మందుల పిచికారీ చేద్దామన్నా వర్షపు జల్లులు ఆగడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి జల్లులు పత్తి పంటకు నష్టం కలిగిస్తున్నాయి. నిత్యం వర్షం వస్తుండడంతో మొక్కలు ఎర్రబారి ఆకులు, పూత, పిందె రాలుతున్నాయి. భూమిలో తేమ తగ్గకపోవడంతో మొక్కలు ఆరోగ్యకరంగా ఎదగడం లేదు.

'నానో'తో మేలంటున్న అధికారులు..
వర్షాలకు పత్తి చేలలో నీరు నిల్వకుండా రైతులు తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కాల్వలు తీసి నీటిని బయటకు పంపించాలని చెబుతున్నారు. వర్షాలతో పత్తి ఎర్రబారకుండా నానో యూరియాను పిచికారీ చేయాలని అంటున్నారు. ప్రస్తుతం మొక్కల వేరు వ్యవస్థ సరిగా పనిచేయదని, అందుకే నానో యూరియాను వినియోగించాలని సూచిస్తున్నారు.

పంటను ధ్వంసం చేసిన అటవీ అధికారులు



అధికారులు ధ్వంసం చేసిన మొక్కజొన్న తోట

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి కూనారం గ్రామ సమీపంలో కొందరు రైతులు 15 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను అటవీ అధికారులు ధ్వంసం చేశారు. ఇవి అటవీ భూములని చెబుతున్న అధికారులు.. రెండు రోజులుగా పంటను నరికేస్తుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ భూములు అటవీ శాఖ పరిధిలో ఉండడంతో పాటు ఇక్కడి రైతులు, అటవీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా రైతులు, అటవీ అధికారులు ఆ భూముల్లోకి వెళ్లొద్దని, ఎలాంటి పనులు చేపట్టవద్దనే నిబంధనలు ఉన్నాయి. మరి అలాంటప్పుడు రైతులు ఎలా వ్యవసాయం చేస్తారని అంటూ అటవీ అధికారులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును వివరణ కోరగా కోర్టు పరిధిలో ఉన్నందున ఆ భూముల్లో ఎవరూ ఎలాంటి పనులు చేపట్టవద్దని, ఆ భూములు పూర్తిగా అటవీ శాఖ పరిధిలోనే ఉన్నాయని తెలిపారు.

సీఎం పర్యటన వాయిదా



వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌బాబు

చండ్రుగొండ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన వాయిదా పడింది. చండ్రుగొండ మండలం బెండాలపాడులో ఈ నెల 21న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, గృహప్రవేశాల కార్యక్రమాల్లో సీఎం పాల్గొనాల్సి ఉంది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తి కావొచ్చాయి. అయితే అదే రోజున ఉపరాష్ట్రపతి ఎన్నికలకు నామినేషన్ల కార్యక్రమం ఉండడంతో రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైంది. దీంతో సీఎం జిల్లా పర్యటన వాయిదా పడినట్లు నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. కాగా, సీఎం పర్యటన వాయిదా పడినట్టు సాయంత్రం తెలియగా.. ఉదయం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులు వర్షంలో తడుస్తూనే ఏర్పాట్లను పర్యవేక్షించారు. చండ్రుగొండలోని హెలిప్యాడ్, దామరచర్లలో బహిరంగసభా స్థలి వద్ద పనులను తనిఖీ చేసి సలహాలు, సూచనలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ కార్యదర్శి నాగసీతారాములు, నాయకులు కోనేరు సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

డీఏఓ బాబూరావు



రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బాబూరావు తదితరులు

మణుగూరు రూరల్ : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అందిస్తున్న సలహాలు, సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు అన్నారు. మండలంలోని గుట్టమల్లారం రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు నేస్తం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంట సాగులో పాటించాల్సిన పద్ధతులను వివరిస్తారని, వారి సలహాలు, సూచనలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓలు రాహుల్‌రెడ్డి, చటర్జీ, హెచ్‌ఓ సాయికృష్ణ, ఏఈఓలు కొమరం లక్ష్మణ్‌రావు, హారిక తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన..
మండలంలోని తిర్లాపురం గ్రామపంచాయతీలో రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, కూరగాయ పంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మణుగూరు ఏడీఏ బి.తాతారావు మంగళవారం పరిశీలించారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ భరత్, హెచ్‌ఓ శివ, హరిశ్చంద్ర పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఏఈఈలకు పదోన్నతి

ఖమ్మంఅర్బన్: ఆర్ అండ్ బీ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఏఈఈ)కు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(డీఈఈ)గా పదోన్నతి లభించింది. రాష్ట్రంలో 15 మందికి పదోన్నతి కల్పించగా ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఉన్నారు. ఈమేరకు ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ ఖమ్మం ఏఈఈ మల్లారపు హరికృష్ణకు డీఈఈ పదోన్నతి కల్పించి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో ఖమ్మంతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలు ఉంటాయి. అలాగే, చింతకాని ఏఈఈ లక్ష్మీనారాయణకు పదోన్నతి కల్పించి మరిపెడలో, పాల్వంచ ఏఈఈ వంశీ వీరేందర్‌ను సత్తుపల్లి డీఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత పదోన్నతులతో ఇప్పటికే ఉన్న ఖాళీలు మరింతగా పెరిగినట్లయింది. ఉమ్మడి జిల్లాలో పదికి పైగా ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న వారికే రెండు, మూడు సెక్షన్ల బాధ్యతలు అదనంగా అప్పగించారు.

సరికొత్త హంగులతో..

- యువజన శిక్షణ కేంద్రం పునరుద్ధరణకు ప్రణాళిక
- రూ.30 లక్షల వ్యయంతో మరమ్మతులకు ప్రతిపాదన
- కలెక్టర్ సందర్శనతో వైటీసీకి మహర్దశ



సుదిమళ్లలోని యువజన శిక్షణ కేంద్రం

ఇల్లెందురూరల్: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలనే లక్ష్యంతో నిర్మించిన వైటీసీ ఏడాదిన్నరగా నిరుపయోగంగా మారింది. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భవనాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించి.. నూతన హంగులతో శిక్షణ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ఐటీడీఏ అధికారులకు సూచించారు. ఈ మేరకు వారు చర్యలు చేపట్టారు.

ప్రారంభంలో విశేష ఆదరణ..
ఇల్లెందు సమీపంలోని సుదిమళ్ల వద్ద రూ.20 కోట్ల వ్యయంతో 2012లో కేంద్ర ప్రభుత్వం భారీ భవనం నిర్మించింది. ఆ భవనంలో ఐటీడీఏ అధికారులు యువజన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఏక కాలంలో మూడు, నాలుగు బ్యాచ్‌లకు పలు అంశాలపై వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా విశాలమైన డిజిటల్ తరగతి గదులు, ప్రొజెక్టర్లు, కంప్యూటర్ ల్యాబ్, వసతి గదులు నిర్మించారు. ప్రారంభంలో కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, టైలరింగ్, బైక్ మెకానిజం తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..
యువజన శిక్షణ కేంద్రం నిర్వహణను ఐటీడీఏ ఉన్నతాధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడంతో లక్ష్యం పక్కదారి పట్టిందనే విమర్శలు వస్తున్నాయి. యువతకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు, ఉపాధి కల్పించినట్లు ప్రభుత్వానికి నివేదిస్తూ రాయితీ పొందారే తప్ప ఏ ఒక్కరికీ ఉపాధి అవకాశాలు లభించలేదనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అలా అరకొర శిక్షణ శిబిరాల నుంచి క్రమంగా మూతపడే స్థితికి చేరుకుంది.


కలెక్టర్ సందర్శనతో..
వైటీసీ దుస్థితిపై 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇల్లెందు మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ కేంద్రాన్ని సందర్శించారు. తలుపులు, కిటికీలు, విలువైన సామగ్రి చెదలు పట్టడం, గదుల్లో ఫ్లోర్ కుంగిపోవడం, మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగానికి వీలు లేకుండా ఉండటం.. ఇలా ప్రతి గదిలోనూ నెలకొన్న అసౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. భవనంలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, మంచాలను చూసి.. వైటీసీ పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. శిక్షణ కేంద్రంలోని ప్రతీ గదిని పరిశీలించి పూర్తిస్థాయిలో సమకూర్చాల్సిన సౌకర్యాలపై అధ్యయనం చేశారు. రూ.30 లక్షల వ్యయంతో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపారు.

శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రణాళిక..
వైటీసీలో శిక్షణ శిబిరాల నిర్వహణకు ఐటీడీఏ అధికారులు ప్రణాళిక రూపొందించారు. సెప్టెంబర్‌లో తొలుత డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవనం మరమ్మతులు పూర్తయిన వెంటనే హాస్టల్ సౌకర్యంతో స్వయం ఉపాధి, పోటీ పరీక్షలకు సన్నద్ధత, ప్రైవేటు రంగంలో ఉపాధి శిక్షణ, జాబ్‌మేళా నిర్వహణ, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధిలో నైపుణ్య శిక్షణ శిబిరాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు..
ఇల్లెందు వైటీసీ మరమ్మతుల కోసం రూ.30 లక్షల వ్యయంతో గిరిజన సంక్షేమ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపించాం. సెప్టెంబర్‌లో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభిస్తాం. మరమ్మతులు పూర్తి కాగానే మరిన్ని శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాం. – వి.హరికృష్ణ, ఐటీడీఏ జేడీఎం

రాష్ట్రంలోనే రెండో స్థానంలో డీసీసీబీ

- బంగారం రుణాల్లో నంబర్–1
- బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన డైరెక్టర్, సీఈఓ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) రూ.3,743 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన బ్యాంకు ప్రగతిని వివరించారు. లావాదేవీల్లో రూ.7 వేల కోట్లతో కరీంనగర్ ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానం ఖమ్మంకు దక్కిందన్నారు. ఇక బంగారం తాకట్టు రుణాల్లో రూ.850 కోట్లతో ఖమ్మం బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఇటీవల కందుకూరు, అడసర్లపాడులో బ్రాంచ్‌లు ప్రారంభించగా, కరుణగిరి, చెరువుమాదారం బ్రాంచ్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మంచుకొండ, సిరిపురంలోనూ ఏర్పాటుకు ప్రతిపాదించామని వెల్లడించారు. ఇదే సమయాన రైతుల సౌకర్యం కోసం సారపాక, అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లను నారాయణపురం, మొండికుంట(అశ్వాపురం)కు మార్చేందుకు నిర్ణయించామని తెలిపారు.

పెరిగిన డిపాజిట్లు
బ్యాంకు డిపాజిట్లు గతేడాదితో పోలిస్తే రూ.121 కోట్లు పెరిగి రూ.1,265 కోట్లకు చేరాయని చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇక రుణాలు రూ.355 కోట్లు పెరిగి రూ.2,195 కోట్లకు చేరాయన్నారు. 2019–20లో రూ.7.23 కోట్ల నష్టాల్లో ఉన్న బ్యాంకు 2023–24లో లాభాల్లోకి రాగా.. 2024–25లో లాభాలు రూ. 5.30 కోట్లకు పెరిగాయని తెలిపారు. అలాగే, ఈ ఏడాది వానాకాలంలో రూ.923 కోట్ల పంట రుణాలు ఇచ్చామని, ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున రూ. 30 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇక బ్యాంకు ఉద్యోగులకు 26శాతం వేతనాలు(పీఆర్‌సీ) పెంచామని, సభ్యుల బీమా ప్రీమియంను రూ.19 నుంచి రూ.14కు తగ్గించామని తెలిపారు. కాగా, ఖమ్మం ఎన్‌ఎస్‌టీ, ఖమ్మం రూరల్ బ్రాంచ్‌ల్లో నకిలీ ధ్రువపత్రాలతో ఇచ్చిన మార్ట్‌గేజ్ రుణాల నుంచి కొంత రికవరీ జరిగిందని చెప్పారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించి రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం, బ్యాంకు సీఈఓ ఎస్.వెంకట్ ఆదిత్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన రేగా



కేటీఆర్‌తో రేగా కాంతారావు

మణుగూరురూరల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో బీఆర్‌ఎస్ అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు.

ఎద్దు ప్రాణాలు కాపాడిన సేవా సంస్థ బాధ్యులు



ఎద్దును బయటకు తీస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: సెప్టిక్ ట్యాంక్‌లో పడి తీవ్ర ఇబ్బంది పడుతున్న ఎద్దును మదర్ థెరిస్సా సేవా సంస్థ సభ్యులు మంగళవారం కాపాడారు. రుద్రంపూర్ ఏరియాలోని సెప్టిక్ ట్యాంకు లో ఎద్దు పడిన సమాచారం కార్పెంటర్ మంద నాగేశ్వరరావు, ఎండీ షబ్బీర్ తెలియడంతో వారు మదర్ థెరిస్సా సేవా సంస్థ సభ్యులు శ్రీనివాస్, సీహెచ్ రాములుకు తెలిపారు. వారు మరికొందరితో కలిసి ట్యాంక్‌లో పడిన ఎద్దును పైకి లాగి కాపాడారు.

భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత?

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో రెండు వేర్వేరు ఘటనల్లో సీసీఎస్ పోలీసులు, ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం భారీగా గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని చెక్ పోస్టు వద్ద మంగళవారం ఉదయం 4 గంటలకు ఓ లారీని ఆపి తనిఖీ చేయగా.. అందులో 7 బస్తాల్లోని 3 క్వింటాళ్ల గంజాయి దొరికిందని తెలిసింది. లారీ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రిజిస్ట్రేషన్‌తో ఉండగా అందులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. మరో ఘటనలో కూడా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గంజాయి పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం మొర్రేడు వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దమ్మపేట సెంటర్ వద్ద మాటు వేసి మూడు ట్రాక్టర్లను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

భవిష్యత్ 'పచ్చ'గా ఉండేలా..

పర్యావరణ పరిరక్షణకు ముందడుగు

- విద్యార్థుల్లో అవగాహనే లక్ష్యంగా జాతీయస్థాయి పోటీలు
- సుస్థిర భవిష్యత్‌కు పునాది వేసేలా కార్యాచరణ
- కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన నిర్వహణ





కరకగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, (ఇన్‌సెట్) మొక్కలు నాటి యాప్‌లో అప్‌లోడ్ చేశాక విద్యార్థికి వచ్చిన సర్టిఫికెట్

కరకగూడెం: నేటి ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణ అనేది అత్యంత కీలకమైన అంశం. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన భూమి, గాలి, నీరును అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ బాధ్యతను విద్యార్థుల్లో, యువతలో పెంపొందించడానికి వారిని పర్యావరణ పరిరక్షణలో క్రియాశీలకంగా భాగస్వామ్యం చేయడానికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏటా నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ్ కాంపిటీషన్ (ఎన్‌ఎస్‌పీసీ) నిర్వహిస్తోంది. 'హరిత్ – ద వే ఆఫ్ లైఫ్' అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గత నెల 1వ తేదీ నుంచి పోటీలు నిర్వహిస్తున్నారు. ఇవి ఈ నెల 21 వరకు కొనసాగనున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటుతూ సెల్ఫీలు దిగుతూ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే, ఈ–సర్టిఫికెట్లు అందుకుంటున్నారు. జాతీయస్థాయిలో క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికీ నగదు పారితోషికంతో పాటు 'జాతీయ హరిత విద్యార్థి' అవార్డుకు అర్హత పొందవచ్చు. ఆగస్టు 30న ఫలితాలు వెల్లడిస్తారు. నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన, బాధ్యతను పెంపొందించడానికి నిర్వహించే జాతీయస్థాయి పోటీ. పర్యావరణ సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారాల దిశగా ఆలోచన, ఆచరణాత్మక చర్యలు చేపట్టడానికి వారిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యం. పాఠశాల విద్యార్థులే కాకుండా ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో పాటు ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.

ఎన్‌ఎస్‌పీసీ లక్ష్యాలు..

- విద్యార్థులు, యువతలో వాతావరణ మార్పులు, కాలుష్యం, జీవవైవిధ్య నష్టం, వనరుల క్షీణత వంటి అంశాలపై అవగాహన కల్పించడం.
- పర్యావరణంపై వ్యక్తిగత బాధ్యతను గుర్తించి, సుస్థిర జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సాహం.
- పర్యావరణ సమస్యలకు వినూత్న, ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడానికి విద్యార్థులను ప్రేరేపించడం.
- పర్యావరణ పరిరక్షణకు వ్యక్తిగత, సామాజిక స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించి, ఆచరణలో పెట్టేలా ప్రోత్సహించడం.
- పర్యావరణ రంగంలో నిపుణులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య విజ్ఞానం, అనుభవాలను పంచుకోవడానికి ఒక వేదికను అందించడం.

పోటీ విధానం, ప్రయోజనాలు..

సాధారణంగా క్విజ్, వ్యాసరచన, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, డిబేట్లు, కళలు, క్రాఫ్ట్ లాంటి విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఇందులో పాల్గొనడం వల్ల విద్యార్థులకు పర్యావరణంపై సమగ్ర అవగాహన పెరుగుతుంది. సృజనాత్మకత, ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుంది. భవిష్యత్‌లో పర్యావరణ రంగంలో వృత్తిని ఎంచుకోవడానికి ప్రేరణ లభిస్తుంది.

పర్యావరణం విలువ తెలుసుకున్నాం..



నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ్ కాంపిటీషన్‌లో పాల్గొనడం నాకు ఒక మంచి అనుభవం. టీచర్లు మమ్మల్ని మొక్కలు నాటమని ప్రోత్సహించారు. మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోస్తూ పర్యావరణం విలువ తెలుసుకున్నాం. పర్యావరణ పరిరక్షణకు నేను కూడా పాటుపడుతా. –ఎర్ర స్వీటీ, 10వ తరగతి, కరకగూడెం

పర్యావరణ రక్షణలో భాగస్వామి కావాలి..



విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపు కోసం ఈ పోటీలు ఉపయోగపడతాయి. పుస్తకాల్లో చదివే పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, కాలుష్యం వంటి సమస్యల పరిష్కారం కోసం యువత ఆచరణలోకి రావాలి. చిన్నప్పటి నుంచే బాధ్యత కలిగిన పౌరులుగా మారుతారు. –నాగరాజశేఖర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

ఆవుపేడ పొడితో గణపతి విగ్రహాలు



అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

- నిమజ్జనం తర్వాత ఎరువుగా ఉపయోగం
- గోశాల నిర్వాహకుల వినూత్న ప్రయత్నం



గోవు పేడ పొడితో చేసిన విగ్రహం

ఖమ్మంఅర్బన్: ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా జలాశయాలు కలుషితమవుతున్నాయి. ఈ విషయమై అవగాహన పెరగడంతో కొన్నేళ్లుగా చాలామంది మట్టితో చేసిన ప్రతిమలను పూజిస్తున్నారు. ఈక్రమంలో ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, ఆరుట్ల శ్రీరామ్ ఇంకో అడుగు ముందుకేశారు. గోశాలలో పెద్దసంఖ్యలో ఆవులను సంరక్షిస్తుండగా.. వీటి పేడను ఎండబెట్టి పొడిగా మార్చి వినాయక విగ్రహాలు రూపొందిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా తయారుచేసే ఈ ప్రతిమలను పూజలు చేశాక నిమజ్జనం చేస్తే నేలలో కలిసి ఎరువులుగా మారతాయి. ఒక్కో విగ్రహాన్ని రూ.100తో విక్రయిస్తుండడంతో భక్తులు కొనుగోలుకు ముందుకొస్తున్నారు. ఇలా వచ్చే ఆదాయాన్ని గోశాలలోని పశువుల దాణా, సంరక్షనకు వినియోగిస్తున్నామని శ్రీనివాసాచార్యులు తెలిపారు. కాగా, గతంలో ఆవుపేడ పొడితో రాఖీలు, దీపాంతలు కూడా తయారుచేశారు. అంతేకాక గోమూత్రంతో ఫినాయిల్ తయారుచేసి విక్రయిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

వివాదాస్పదంగా హమాలీల వ్యవహారం!

పాల్వంచ: ఓ రైస్ మిల్లు ఓనర్‌కు, హమాలీలకు మధ్య జరుగుతున్న వ్యవహారం కొన్ని నెలలుగా వివాదాస్పదంగా మారింది. పట్టణంలోని కేఎస్‌పీరోడ్‌లో గల ఓ రైస్ మిల్లు నిర్వాహకుడు తన మిల్లులో రోజువారీగా పనిచేసేందుకు సుమారు 30 మందిని బిహార్ నుంచి రప్పించాడు. దీంతో స్థానికంగా ఉండే తమకు పనిలేకుండా పోతుందని హమాలీ ముఠా బాధ్యులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో స్థానిక హమాలీలే పనిచేసేందుకు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే రోజుకు 30 మంది పనికి వస్తామని చెప్పి సగం మంది కూడా రాకపోవడం, వచ్చినా సరిగా పనిచేయక పోవడంతో విసుగెత్తిన సదరు మిల్లు నిర్వాహకుడు లేబర్ కమిషనర్‌ను సంప్రదించాడు. మిల్లుకు సక్రమంగా వర్కర్లు రాకపోవడంతో రైతులు తెచ్చిన ధాన్యం సైతం వర్షాలకు తడిసి మిల్లు నిర్వాహకుడు తీవ్రంగా నష్టపోయాడు. ఈ విషయం కాస్త పోలీస్ స్టేషన్‌కు చేరింది. అనంతరం హమాలీ అనుబంధ యూనియన్ నేతలు మిల్లు నిర్వాహకుడు, హమాలీల మధ్య రాజీ కుదిర్చేందుకు కొన్ని రోజులుగా యత్నిస్తున్నప్పటికీ కొలిక్కి రాలేదు. కాగా, ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే బయటే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పామని తెలిపారు.

రోడ్డు గుంతలమయం..

- వాహనదారుల అష్టకష్టాలు
- నిద్రావస్థలో అధికారులు..



ప్రమాదకరంగా ఉన్న గుంత



టేకులపల్లి సెంటర్‌లో అదుపుతప్పి కింద పడిన వాహనదారులు

టేకులపల్లి: మండల కేంద్రం నుంచి బొమ్మనపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లోని ఎన్‌హెచ్ 930పీ రహదారిలో పెద్ద గుంత ఏర్పడి మంగళవారం ఓ గంట వ్యవధిలోనే పదుల సంఖ్యలో వాహనాలు అదుపుతప్పాయి. అందులో పలువురు గాయపడగా.. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అంతేకుండా ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అంశంపై 'సాక్షి'తోపాటు మీడియాలో వార్తలు వచ్చాయి. అంతేకాకుండా సోమవారం మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్‌ల పర్యటించారు. వారి వాహనాలు కూడా ఈ గుంతల్లో నుంచి ఇబ్బందికరంగా వెళ్లాయి. అయినప్పటికీ అధికారుల్లో చలనం రావడం లేదు. ఇదిలా ఉండగా.. గుంతలు లోతుగా ఉండటం, ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో నీరు నిండి లోతు అంచనా వేయలేక ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ఆటోలు, మ్యాజిక్ లాంటి వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. స్థానికులు స్పందించి గుంత ఉన్న ప్రాంతంలో ఎర్రజెండా పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బుగ్గవాగుపై రాకపోకల నిలిపివేత



నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని బుగ్గవాగు లో లెవెల్ కాజ్‌వే పైనుంచి రాకపోకలు నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన అధికారులతో కలిసి బుగ్గవాగును సందర్శించారు. కాజ్‌వేపై నీటి ఉధృతి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

వాలీబాల్ టోర్నీలో విజేతగా జిల్లా జట్టు



బహుమతి అందుకుంటున్న భద్రాద్రి జిల్లా జట్టు

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–15 బాల, బాలికల వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం ప్రథమస్థానంలో నిలవగా రంగారెడ్డి, మంచిర్యాల ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి. ఈ మేరకు విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఈఓ హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీఈటీలు, పీడీలు నాగరాజు, సుధాకర్, షబ్బీర్, చెన్నకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్, బస్వరాజ్, మల్లేశ్, బాబయ్య, వెంకటేశ్, శ్రీలత, జోనల్ సెక్రటరీ పీడీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియుడు

- మనస్తాపంతో పురుగుమందు తాగిన యువతి
- చికిత్స పొందుతూ మృతి



గుగులోత్ తుల్లికశ్రీ (ఫైల్)

టేకులపల్లి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువతి పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించడంతో మృత్యువుతో పోరాడి మృతి చెందింది. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తతండా (జీ) పంచాయతీ వెంకట్యాతండాకు చెందిన గుగులోత్ వీరమోహన్ కుమార్తె తుల్లికశ్రీ (20)ని లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం పంచాయతీ రూప్లాతండాకు చెందిన బానోతు బిచ్చా పెళ్లి చేసుకుంటానని మూడు నెలల కిందట ఒప్పుకున్నాడు. అనంతరం యువతిని బిచ్చా భద్రాచలం, కొత్తగూడెంతోపాటు పలు ప్రాంతాలకు తీసుకెళ్లాడు. ఒకరోజు తుల్లికశ్రీ వేరే అబ్బాయితో మాట్లాడుతోందని అవమానించి, పెళ్లి చేసుకోనని ఫోన్‌లో బిచ్చా మెసేజ్‌లు పెట్టాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. యువతి బాబాయి రాజేందర్ ఈ నెల 15న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మంగళవారం యువతి మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

మణుగూరుపై సింగరేణి ముద్ర

- పట్టణాభివృద్ధికి సహకారం ఎంతో..
- సీఎస్‌ఆర్‌లో భాగంగా రూ.కోట్ల నిధుల కేటాయింపు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ నాగబాబు

మణుగూరుటౌన్: మణుగూరు అభివృద్ధిలో సింగరేణి ముద్ర కనిపిస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా తనవంతు సహకారం అందిస్తూ కీలకపాత్ర పోషిస్తోంది. బొగ్గు ఉత్పత్తిలో తన రికార్డులను తానే తిరగరాస్తూ మణుగూరు కీర్తిని నలుదిశలా వ్యాప్తి చేస్తోంది. సింగరేణి 1974 పీకే–1 గనిగా ప్రారంభమై అంచెలంచెలుగా విస్తరిస్తూ ఇప్పటికే 50 ఏళ్లు పూర్తి చేసుకుని 51వ వసంతంలోకి అడుగులు పెడుతోంది. ఇటు స్థానికులకు ఉపాధికల్పించి చేయూతనందిస్తూనే మరోవైపు వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధికి ఊతమిస్తుండగా.. నేడు ఓసీ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

రూ.కోట్లు కేటాయింపు..

సింగరేణి తన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను ఏటా పెంచుకుంటూనే సమీప గ్రామాల అభివృద్ధి, మణుగూరుకు 2014 నుంచి 2025 వరకు రూ.20కోట్లకు పైగా షేప్ నిధులు మంజూరు చేసింది. పంచాయతీల అభివృద్ధికి, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులతో పాటు సింగరేణి ప్రభావిత గ్రామాల్లో బోర్‌వెల్స్ తీయించడం, సైడ్‌డ్రైయిన్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుకు ఈ నిధులు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఫర్నిచర్, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. మణుగూరు మున్సిపాలిటీ ముంపునకు గురి కాకుండా కట్టువాగు, మొట్టువాగు, కోడిపుంజుల వాగు పూడికతీత పనులకు ప్రత్యేక నిధులు కేటాయించింది.

వేలాది మందికి ఉపాధి..

సింగరేణిలోని మణుగూరు ఏరియాపై వేలాది మంది ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. గనుల్లో ఉండే కాంట్రాక్ట్ అవకాశాల్లో భూ నిర్వాసితులకు ప్రాధాన్యం ఇస్తూనే ఓసీల్లో ఔట్ సోర్సింగ్ పనుల్లో డ్రైవర్లు, బొగ్గు రవాణా, బెల్ట్ క్లీనింగ్, ఓబీ కంపెనీల్లో వర్కర్లు, సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీలు, సేల్ పికింగ్ వంటి కాంట్రాక్ట్ పనుల్లో ప్రస్తుతం సుమారు 3,400 మంది ఉపాధి పొందుతున్నారు. దేశవ్యాప్తంగా మణుగూరులోని సింగరేణి బొగ్గుకు డిమాండ్ ఉండటంతో అనుసంధానంగా ఏర్పడిన బీటీపీఎస్, హెవీవాటర్ ప్లాంట్‌లకు లారీల ద్వారా, బకెట్ల ద్వారా బొగ్గును సరఫరా చేస్తూనే స్థానిక వ్యాపారులకు అవకాశాలు కల్పించి లారీల ద్వారా బొగ్గును కేటీపీఎస్, ఏపీ జెన్కో, తమిళనాడు, కర్ణాటక విద్యుత్ కర్మాగారాలకు లారీల ద్వారా బొగ్గును తరలిస్తున్నది. స్థానిక లారీ యజమానులకు జీవనోపాధిని కల్పిస్తోంది.

ప్రజాభిప్రాయ సేకరణకు సర్వం సిద్ధం

మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా ఇప్పటికే భూ సేకరణపై పిసా గ్రామసభల్లో ప్రజామోదం లభించగా, ప్రస్తుతం సర్వే దశలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా పర్యావరణ అనుమతుల కోసం బుధవారం ఏరియాలోని నేతాజీ గ్రౌండ్ వద్ద సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 1500 – 2000 మంది స్థానిక ప్రజలు సభకు రానున్నారు. సభ ఆమోదం ద్వారా పర్యావరణ అనుమతులతో మణుగూరు ఓసీ విస్తరణకు మార్గం సుగమం కానుంది. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శామియానాల ఏర్పాటుతో పాటు ప్రత్యేక పార్కింగ్ స్థలం, ప్రత్యేక భోజన ప్రదేశాలు ఏర్పాటు చేసింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ నాగబాబు సభాస్థలిని పరిశీలించారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఎస్‌ఓటూ జీఎం శ్రీనివాసాచారి, డీజీఎం (పర్సనల్) రమేశ్, ఎస్టేట్స్ అధికారి బాబుల్‌రాజు, పర్యావరణ అధికారి శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్ పనులు పర్యవేక్షించారు.

అభివృద్ధికి సహకారం



మణుగూరు అభివృద్ధికి సింగరేణి సహకారం అందిస్తోంది. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఏటా నిధులు కేటాయిస్తోంది. స్థానిక ప్రజల విషయంలో సహృదయంతో ప్రవర్తిస్తూ ఉపాధి కల్పనతో పాటు సమీప గ్రామాల అభివృద్ధికి సింగరేణి సహకారం ఎల్లవేళలా ఉంటుంది. –దుర్గం రాంచందర్, ఏరియా జీఎం

మహిళ ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: మంత్రాలు వస్తాయని ఆరోపిస్తూ ఓ వ్యక్తి తనపై దాడి చేసి అవమాన పర్చాడనే మనస్తాపంతో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన వల్లపు కుమారిని ఈ నెల 16వ తేదీన ఇంటి పక్కన ఉండే ఆటోడ్రైవర్ రాపోలు రవి నీకు మంత్రాలు వస్తాయంట కదా అని ఆరాతీశాడు. దీంతో ఆమె విషయాన్ని భర్తకు చెప్పింది. దంపతులిద్దరూ రవిని నిలదీశారు. గొడవపడ్డారు. మరుసటి రోజు గ్రామ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అదే రోజున కుమారి పురుగుమందు తాగగా కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై పాల్వంచ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుమారి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కూలిన పూరిల్లు



కుప్పకూలిన పూరిల్లు

జూలూరుపాడు: మండలంలోని భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనకతండాకు చెందిన ధరావత్ జగ్గ పూరిల్లు మంగళవారం కూలిపోయింది. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పూరిల్లు నాని కుప్పకూలింది. ఆ సమయంలో ధరావత్ జగ్గ, ధర్మి దంపతులు బయట ఉండటంతో ప్రమాదం తప్పింది.

ద్విచక్రవాహనదారుడిపై కేసు

పాల్వంచరూరల్: రోడ్డుపై నిల్చున్న వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ కేటీపీఎస్ ఏ–కాలనీలో నివాసం ఉంటూ ఆర్టిజన్‌గా పనిచేస్తున్న కురుపావత్తు శ్రీనివాస్ ఈ నెల 14వ తేదీన జగన్నాథపురం గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ.. కేశవాపురం వద్ద రోడ్డు పక్కన నిలబడి ఫోన్ మాట్లాడుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో శ్రీనివాస్ గాయపడ్డాడు. క్షతగాత్రుడి కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు బొల్లం నిఖిల్‌పై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

ఆటో పల్టీ.. మహిళకు తీవ్ర గాయాలు

ఇల్లెందు: ఆటో పల్టీకొట్టి మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక బస్టాండ్ నుంచి గుండాల బస్ బయలు దేరింది. అదే గ్రామానికి చెందిన నూనావత్ స్వప్న బస్సును అందుకోలేకపోయింది. ఓ ఆటో మాట్లాడి బస్సును అందుకోవాలని చెప్పింది. డ్రైవర్ ఆటోను బస్ కోసం వేగంగా నడుపుకుంటూ వెళ్లడంతో చెరువు కట్ట సమీపంలో పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న స్వప్న తీవ్రంగా గాయపడగా.. ఖమ్మం తరలించారు.

మట్టి ట్రాక్టర్ సీజ్

పాల్వంచరూరల్: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని రంగాపురం శివారు మామిడితోట నుంచి మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఆర్‌ఐ నళినికుమార్ వెళ్లగా స్థానికులు చుట్టుముట్టి వాగ్వాదానికి దిగారు. ఇందిరమ్మ ఇంటికోసం మట్టిని తీసుకెళ్తుంటే అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. అయితే, అనుమతి లేనందున ట్రాక్టర్‌ను సీజ్ చేయగా.. మరో రెండు ట్రాక్టర్ల డ్రైవర్లు పారిపోయారని ఆర్‌ఐ తెలిపారు.